దలతో రైతులు సతమతం అవుతున్నారు. కాబట్టి రాబోయే రోజుల్లో వీటిని తట్టుకునే వంగడాలు, వాణిజ్య పంటలకు ప్రాధాన్యం పెరగనుంది. ఇక ఎగుమతుల విషయంలో కూడా అనూహ్యమైన మార్పులు రాబోతున్నాయి. పంటలకు తగిన విలువ దక్కడానికి శీతలీకరణ కేంద్రాల (కోల్డ్ స్టోరేజీలు) దగ్గరనుంచీ రవాణా వరకూ అంతా మరింత సులభతరం కానుంది. ప్రవాస భారతీయులు కూడా రాబోయే రోజుల్లో వ్యవసాయం మీదా పెట్టుబడులు పెట్టబోతున్నారని మరో విశ్లేషణ. ఇవన్నీ కూడా సాగుకు శుభసూచకాలే!

**ఆరోగ్యం**

కొవిడ్ తర్వాత ఆరోగ్యరంగంలో వచ్చిన మార్పుల గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. అందులో కొన్ని సందర్భాలు మరింత బలపడనున్నాయి. ఉదాహరణకు డిజిటల్ మాధ్యమాల ద్వారా వైద్యులను సంప్రదించే వ్యాపారం ఏకంగా 15 లక్షల కోట్లకు చేరుకోనుందని అంచనా. అలాగే మన జన్యువులు, ఆరోగ్యం, అలవాట్లను బట్టి ఒకో వ్యక్తికీ ఒకోరకమైన చికిత్సను అందించే 'Personalized Medicine'కి ఇంపార్టెన్స్ పెరగనుంది. ఇక మన ఆరోగ్యాన్ని నిరంతరం గమనించే పరికరాలు చిన్నపాటి వాచీలతో ఆగిపోవడం లేదు. చిన్న చిన్న ఇంప్లాంట్స్ అమర్చడం ద్వారా రోగాన్ని విశ్లేషించేందుకు కానీ, అదుపులో ఉంచేందుకు కానీ ప్రయత్నాలు జరగబోతున్నాయి. వీటి రూపకల్పనకు నానో టెక్నాలజీ అండగా ఉండబోతున్నది. కొద్ది రోజులుగా మన జీర్ణకోశ ఆరోగ్యానికీ (Gut Health) ఆయుష్షుకీ సంబంధం ఉందని ఎన్నో పరిశోధనలు నిరూపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఈ గట్ హెల్త్‌కి మరింత ప్రాముఖ్యత పెరగనుంది. ఇక త్రీడీ ప్రింటింగ్ ద్వారా అంతర్గత అవయవాలను సైతం రూపొందించి అమర్చే సాంకేతికతా ఊపు అందుకోనుంది.

**ఓ మర మనిషి!**

మర మనుషులు పెరిగిపోతున్నారు. వాటి గురించి వినడం దగ్గర నుంచీ నేరుగా రెస్టారెంట్లలో చూసే పరిస్థితికి వచ్చేశాం. రాబోయే రోజుల్లో ఈ పరిణామం మరింత విజృంభిస్తుంది. ఈ దశలో రెండు కీలకమైన మార్పులను కూడా ఆహ్వానించాల్సిందే. మొదటిది Human-robot interaction (HRI). రోబోలను రూపొందించడం, అవి సరిగ్గా స్పందించేలా ప్రోగ్రామింగ్ చేయడం, ఉద్యోగాలకు పోలిన ప్రవర్తన చొప్పించడం లాంటి ఎన్నో కీలకమైన అంశాలు ఈ HRI లోకి వస్తాయి. ఇదంతా కూడా ఉపాధికి సంబంధించినది. ఇక Brain-Computer Interface (BCI) రెండో మార్పు. అంటే నేరుగా మనమే కంప్యూటర్‌తో సంభాషించడం. మెదడులో చిప్ అమర్చడం దగ్గరనుంచీ కృత్రిమ చేయి వరకూ భిన్న మార్గాలతో ఇది సాధ్యమవుతుంది. వీడియో గేమ్స్ నుంచి అంగవైకల్యం వరకూ ఎన్నో రంగాలలో ఇది అడుగుపెట్టనుంది. BCI పరికరాలతో కంప్యూటర్లు నేరుగా మన మెదడు నుంచే స్పందనలు అందుకుంటాయి.










**రాజకీయం!**

ట్రంప్ రాకతో లోకానికి పెద్దన్నగా భావిస్తూ, ప్రవర్తిస్తుండే అమెరికా తీరు అనిశ్చితంగా మారనుంది. వలసల మీద ఉక్కుపాదం, అధిక పన్నులను విధిస్తానని హెచ్చరించడం, మధ్యవర్తిత్వాలకు దూరం జరగడం లాంటి ప్రకటనలతో ఇప్పటికే గుబులు రేకెత్తిస్తున్నాడు ట్రంప్. చైనా నాయకత్వంలో కానీ, దూకుడులో కానీ ఎలాంటి మార్పూ లేకపోవడంతో... వచ్చే ఏడాది కూడా మన పక్కలో బల్లెంలాగే సాగుతుంది. బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, శ్రీలంక్, మాల్దీవుల్లాంటి వ్యూహాత్మక దేశాలను మనకు వ్యతిరేకంగా మార్చే ప్రక్రియ ఊపందుకుంటుంది. ఉక్రెయిన్- రష్యా, ఇజ్రాయిల్- పాలస్తీనా యుద్ధాలు... సిరియాలో అనిశ్చితి లాంటి పరిస్థితులేవీ ప్రపంచ శాంతికి అనుకూలంగా లేవు. ఉండే సూచనలూ కనిపించడం లేదు. ఇంధనం నుంచి వలసల వరకూ వీటి ప్రభావం వచ్చే ఏడాది మరింత తీవ్రం కానుంది.

**మరిన్ని మార్పులు!**

**జాబిల్లి దాకా:** అంతరిక్షంలోకి వెళ్లడం లేదా గురుత్వాకర్షణ స్థాయిని దాటడం... ఇప్పటివరకూ కుబేరులకు మాత్రమే సాధ్యమయ్యేది. కానీ ఇప్పుడు కొన్ని లక్షలు పెట్టుకుంటే చాలు అంతరిక్షపు అనుభూతిని

## శక సంవత్సరం

ప్రపంచం అంతా ఒకే తాటిన నడవడానికి గ్రెగోరియన్ కేలెండర్ పాటిస్తున్నారు. కానీ మనకంటూ కొన్ని కాలమాన పరిస్థితులు ఉన్నాయి కదా! భారతదేశంలోనే మన తెలుగువారికి ఉగాది కొత్త సంవత్సరం అయినట్టు... వేర్వేరు ప్రాంతాలవారు వేర్వేరు నూతన సంవత్సరాలను పాటిస్తుంటారు. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని ప్రముఖ శాస్త్రవేత్త మేఘనాథ్ సాహా ఆధ్వర్యంలో ఒక కేలెండర్‌ను రూపొందించింది ప్రభుత్వం. శాతవాహన వంశానికి చెందిన శాలివాహనుడు శక రాజులను ఓడించిన క్రీ.శ 78 సంవత్సరం ప్రామాణికంగా ఈ శక సంవత్సరం ఉంటుంది. అటు సూర్యమానాన్నీ, ఇటు చంద్రమానాన్నీ కూడా కలుపుతూ ఈ శక కేలెండర్ సాగడం విశేషం. సాధారణ సంవత్సరాల్లో మార్చి 21, లీప్ సంవత్సరంలో మార్చి 22న ఈ సంవత్సరం మొదలవుతుంది.

